క్లుప్తంగా

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి తదితరులు

బొబ్బిలి: అభివృద్ధి పనులు చేపట్టడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే ముందంజ అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని 4, 31 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దుతామన్నారు. ఎక్కడ కూడా ఆలస్యం చేయకుండా పనులు జోరందుకునేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు, వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు చనమల్ల ప్రసాదరావు, వివిధ వార్డుల ఇన్‌చార్జిలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రామభద్రపురంలో భారీ వర్షం



రామభద్రపురంలో పూర్తిగా నీట మునిగి పాడవుతున్న పొట్టి చిక్కుడు పంట

రామభద్రపురం: మండల కేంద్రంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువులు నిండి వాగులు వంకలు పొంగి పారుతున్నాయి. సుమారు గంటన్నర పాటు భారీగా వర్షం కురవడంతో పల్లపు భూములు వర్షపు నీటితో చెరువులను తలపించాయి. వరి నాట్లు నిండా మునిగాయి. కూరగాయ పంటలలో నీరు చేరి దెబ్బతిన్నాయి. దీంతో చెరువులు నిండాయి పంటల సాగుకు సాగు నీటి ఇబ్బందులు తీరాయని ఓ వైపు ఆనందం కాగా పంటలు నీటిలో మునిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేత్రవైద్య శిబిరం



వృద్ధుడి కంటిని పరిశీలిస్తున్న ఆఫ్తాలమిక్ అధికారి వసంతరావు

రాజాం: వైఎస్సార్ కంటివెలుగు పథకంలో భాగంగా స్థానిక పట్టణంలోని మారుతీనగర్ నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో నేత్రవైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన పలువురి వృద్ధుల కళ్లను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మరికొంతమందికి నేత్ర శస్త్రచికిత్సకు, కళ్లద్దాల పంపిణీకి జిల్లా అంధత్వ నివారణ సంస్థకు సిఫారసు చేశామని ఆప్తాలమిక్ అధికారి చప్పటి వసంతరావు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వి.స్వాతిలక్ష్మి, ఆశవర్కర్లు కనకమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

రూ.9 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: మండలంలోని దోసరిరామినాయుడువలస గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం మంగళవారం చేపట్టారు. నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీఓ బాసూరి శంకరరావు దాదాపు రూ.9 లక్షల వ్యయంతో ఈ నిర్మాణం చేపడుతున్నామని, నాణ్యతా ప్రమాణాల మేర పనులు జరిగేలా చూడాలని సర్పంచ్ కరణం తులసీనాయుడును కోరారు. కార్యక్రమంలో పీఆర్‌జేఈ ప్రభాకరరావు, ఈఓపీఆర్‌డీవో వి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన



పొలం వద్దనే జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో జీవామృతం తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జీవామృతంతో ఎంతో మేలు జరుగుతుందని, జీవామృతం వినియోగించిన పంటలు సస్యశ్యామలంగా ఉండడంతో పాటు, పంటలకు పట్టే చీడపీడలు నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభించి, సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంట చేతికిరావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



గురవాంలో గడప గడపకూ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గురవాం గ్రామంలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను ఓ భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి పవిత్ర గంథాలుగా భావించి, అందులోని హామీలను నెరవేర్చారన్నారు. ఇప్పటివరకు దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలుచేయనన్ని పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఆయన రూపొందించి, అమలు చేస్తున్న పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ప్రతీ ఇంటికి ఏదో ఒక పథకం రూపంలో లబ్ధి జరుగుతోందన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. మరోవైపు ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో జోరుగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. గతంలో టీడీపీ హయాంలో పథకాలు ఏ విధంగా ఎవరికి అందేవో అందరికీ బాగా తెలుసన్నారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే లబ్ధి జరిగేదన్నారు. కానీ ఇప్పుడు అలా కాదన్నారు. అర్హులుంటే చాలని, ఏ పార్టీ వ్యక్తి అని చూడకుండా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ప్రజల్లో ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే చంద్రబాబు అండ్ కో లేనిపోని విమర్శలతో తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబును నమ్మితే రాష్ట్ర అంధకారమవుతుందన్నారు. మరోసారి సీఎం జగనన్న సంక్షేమ పాలనకే ఓటు వేసి, 2024లోనూ వైఎస్సార్ సీపీకే అధికారం కట్టబెట్టాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్ బేరి రమణమ్మ, పార్టీ నేతలు ఎ.రాంబాబు, ఉప సర్పంచ్ ఎ.సత్యనారాయణ, ఎ.రామ్మోహన్, సీహెచ్ సంగం నాయుడు, సీహెచ్ శ్రీనివాసరావు, కె.సింహాచలం, ఎల్.లక్ష్మణరావు, ఎ.శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.చిన్నంనాయుడు, వి.విజయ్‌కుమార్, ఎంపీడీఓ బి.శంకరరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, ఏపీఓ సాయిరాం, ఏపీఎం దధికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు చిరునామా సీఎం జగన్

- ఎమ్మెల్యే శంబంగి



పణుకువలసలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, సంక్షేమ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పణుకువలస గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చందక సత్యనారాయణ, గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు వర్తించిన లబ్ధిని వివరిస్తూ వాటికి సంబంధించిన బుక్‌లెట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్నారన్నారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ ప్రజలంతా ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, తెర్లాం వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎన్. బాబ్జీరావు, వైస్ ఎంపీపీలు సీహెచ్ సత్యనారాయణ, రమాదేవి అప్పలరాజు, జెడ్పీటీసీ లూర్థు రామారావు, ఎంపీటీసీ వెంకట శేషగిరి, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)ఆధ్వర్యంలో రూపొందించిన ఆహా హోటల్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. ఇక్కడి రైల్వేస్టేషన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ప్రారంభించి మెప్మా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ఉపాధి' ప్రజా వేదిక



ఉపాధి హామీ సోషల్ ఆడిట్ బహిరంగ వేదికలో పనులపై సిబ్బందిని ప్రశ్నిస్తున్న అధికారులు

బొబ్బిలి: గడచిన ఏడాదికి సంబంధించి మండలంలోని 30 గ్రామ పంచాయితీలలో చేపట్టిన ఉపాధి హామీ పనుల వార్షిక తనిఖీ అనంతరం మండల పరిషత్ ఆవరణలో మంగళవారం బహిరంగ వేదిక నిర్వహించి సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలను గ్రామాల వారీగా రిసోర్సు పర్సన్లు వెల్లడించారు. ఏపీడీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీలో పలు గ్రామాల్లో చెట్ల పెంపకంతో పాటు వాటికి అమర్చిన ట్రీ గార్డులు లేవని తనిఖీ బృందాలు గుర్తించాయి. అధిక సంఖ్యలోని గ్రామాల్లో ఇదే సమస్య కనిపించింది. అలాగే పలు గ్రామాల్లో ఒకటి నుంచి ఇద్దరు ముగ్గురు వేతన దారులకు ఒక రోజు మస్తర్లు అదనంగా వేసినట్టు గుర్తించారు. దీనిపై తనిఖీ అధికారులు ప్రశ్నించగా ఇప్పటికే గ్రామాల్లో చర్చించి పొరపాటుగా నమోదు అయిందనీ, సవరించినట్టు ఫీల్డ్ అసిస్టెంట్లు సమక్షంలో తనిఖీ బృంద సభ్యులు వెల్లడించారు. మొత్తం రూ.20 కోట్ల విలువైన పనులపై ఆడిట్ నిర్వహించి మండల పరిషత్ ఆవరణలో బహిరంగ చర్చా వేదిక నిర్వహించారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాల నాయుడు, విజిలెన్స్ జిల్లా అధికారి రవీంద్ర, ఏపీడీ జనార్దనరావు, ఎంపీడీఓ రవికుమార్, వైఎస్సార్‌పీ అచ్యుతరావు, గత ఏపీఓ జనార్దనరావు, హౌసింగ్ ఏఈ అల్లు సూర్యనారాయణ, పీఆర్ ఏఈ రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ

రేగిడి: మానవ సేవే మాధవ సేవ అని ప్రతిఒక్కరూ మానవ సేవ చేసేందుకు ముందుకు రావాలని ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు సత్యసాయి భక్తులు నారాయణసేవ చేశారు. ఆయన మాట్లాడుతూ సాయిరాం భక్తులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు, భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



రేగిడి ఆమదాలవలసలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబఖండి, సంకిలి గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలసలో ఆలయ పూజారి కిన్నెరకాంతం అన్నారావు ఆధ్వర్యంలో భక్తులు విశేష పూజలు చేసి, దైవదర్శనం చేసుకున్నారు.

సంతకవిటి: మండలంలోని కాకరాపల్లి, మందరాడ, పోతులజగ్గుపేట గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవదంపతులు, మహిళలు పాల్గొని, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు.

165 కొత్త పింఛన్లు మంజూరు

బాడంగి: మండలానికి 165 కొత్త పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. కొత్త లబ్ధిదారుల పరిశీలన చేపట్టినట్టు చెప్పారు. పరిశీలనకు తనతో పాటు ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ఎంఈఓ-2 ఎం.రాజేశ్వరి మూడు బృందాలుగా ఏర్పడినట్టు తెలిపారు. వీరికి సెప్టెంబర్ నెలలో పింఛన్లు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

నిధుల మళ్లింపుపై విచారణ

బాడంగి: మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.35లక్షల్లో రూ.4.9లక్షలు మండల పరిషత్ కార్యాలయ ముస్తాబుకు మళ్లించారన్న లోకాయుక్తకు ఫిర్యాదు అందడంతో సీఈఓ(ఇన్‌చార్జి) కె.రాజ్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. అప్పటి ఎంపీడీఓ అక్కారావు మండల సర్వసభ్య సమావేశంలో అటెండెన్స్ రిజిస్టర్‌లో ఎంపీటీసీ సంతకాలనే తీర్మానంగా చూపించి తమకు తెలియజేయకుండా నిధులు మళ్లించి ఖర్చు చేశారని వాడాడ ఎంపీటీసీ రెడ్డి సునీత లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇన్‌చార్జి సీఈఓ విచారణ చేసి వివరాలు తెలుసుకున్నారు. విచారణకు బదిలీ ఎంపీడీఓ అక్కారావు, ప్రస్తుత ఎంపీడీఓ ఆంజనేయులు హాజరయ్యారు.

పక్కాగా మరుగుదొడ్ల నిర్వహణ



అంట్లవార పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లను సక్రమంగా నిర్వహించకపోతే సంబంధిత స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ త్రినాథరావు హెచ్చరించారు. మండలంలోని అంట్లవార ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో గల మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకంలో మెనూ అమలు, పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల వర్కు బుక్స్ రాయడం, ఉపాధ్యాయుల లెసన్ ప్లానింగ్, డైరీ, పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించేందుకు పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలోని మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించాలని స్కావెంజర్‌కు తెలియజేశారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని సక్రమంగా అమలు చేసే పర్యవేక్షించాలని ఉపాధ్యాయునికి సూచించారు. ఆయనతో పాటు హెచ్‌ఎం ఆర్.వెంకటరమణ ఉన్నారు.

ఈ - క్రాప్ నమోదు చేసుకోవాలి



పెరుమాళిలో ఈ-క్రాప్ నమోదు

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోని రైతులంతా ఖరీఫ్ సీజన్‌లో వారు సాగు చేస్తున్న పంటలకు ఈ - క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ జి.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయ గ్రామ వ్యవసాయ సహాయకులు మంగళవారం నమోదు చేస్తున్న ఈ - క్రాప్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో 20,260 ఎకరాల్లో ఈ ఏడాది ఈ - క్రాప్ నమోదు చేయాల్సి ఉండగా, ఇంతవరకు 2,778 ఎకరాల్లో ఈ - క్రాప్ నమోదు పూర్తయ్యిందని తెలిపారు. రైతులు తాము పండిస్తున్న పొలం వద్దకు వెళ్లకుండా ఈ - క్రాప్ నమోదు చేయడం కుదరదని చెప్పారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకోని రైతులు తాము పండించే పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించుకొనేందుకు అవకాశం ఉండదన్నారు. రైతులు వీఏఏల ద్వారా ఈ-క్రాప్ నమోదు త్వరితగతిన చేయించుకోవాలని అన్నారు.

అర్హులకు పింఛన్లు



తెర్లాం-1 సచివాలయంలో పెన్షనర్ల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తెర్లాం: వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక ఒకటో గ్రామ సచివాలయంలో కొత్తగా పెన్షన్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదార్ల ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, పెన్షన్ కోసం దరఖాస్తు చేసినప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచిన ధ్రువీకరణ పత్రాలు సరిపోయినదీ, లేనిది పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. అన్ని అర్హతలు ఉన్న వారికి పెన్షన్లు మంజూరుకు సిఫార్సు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఆయనతో పాటు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ హరి, గ్రామ వలంటీర్లు ఉన్నారు.

మరిన్ని సేవలందించండి



శంకరరావు, పోలినాయుడులను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బొబ్బిలి: జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉన్నత సేవలందించిన ఉపాధి హామీ కంప్యూటర్ ఆపరేటర్ పోలినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ శంకరరావులను మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాల నాయుడు, ఉపాధి హామీ ఏపీడీ లక్ష్మణరావు, ఎంపీడీఓ రవికుమార్, మరో ఏపీడీ జనార్దనరావు, విజిలెన్స్ అధికారి రవీంద్ర సత్కరించిన వారిలో ఉన్నారు.

అంబఖండిలో 'పొలంబడి'



సాగులో మెలకువలు వివరిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అధిక దిగుబడులకు అనుసరించాల్సిన సాగు పద్ధతులు, సాగులోని మెలకువలను ఏవో మురళీకృష్ణ రైతులకు వివరించారు. అలాగే ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగం, ఎరువుల వాడకం, ఈ-క్రాప్ నమోదు, కూలీల కొరత నివారణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతీ రైతు వ్యవసాయాధికారుల సలహాలు సూచనలు పాటించాలని, అలా అయితే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ కెంబూరు శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

రాజాంలో విజిలెన్స్ తనిఖీలు

రాజాం సిటీ: రాజాంలో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కల్తీ ఉత్పత్తులు విరివిగా విక్రయాలు చేపడుతున్న సమాచారం తెలుసుకున్న అధికారులు విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. శ్రీనివాస థియేటర్ రోడ్డులోని ఓ దుకాణంలో చేసిన సోదాల్లో అనుమానిత టీ పొడిని ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారుల సమక్షంలో పట్టుకున్నారు. దీని నాణ్యతను తెలుసుకునేందుకు ల్యాబ్‌కు తరలించారు. విజిలెన్స్ అధికారులు వచ్చారన్న సమాచారం తెలుసుకున్న రాజాంలోని వ్యాపారులు దుకాణాలను మూసివేయడంతో అధికారులు వెనుదిరిగారు.

నిరసన

వంగర: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు మంగళవారం నిరసనకు దిగారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది కిరణ్, పారయ్య, వాసు, సంగోజి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



సంకిలి పాఠశాలలో విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ ఎరకయ్య

రేగిడి: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలని మండల విద్యాశాఖాధికారి బి.ఎరకయ్య ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని సంకిలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి విద్యాసామర్థ్యాలను అంచనా వేశారు. అనంతరం పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపట్టీలను పరిశీలించారు. ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని, జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలు చేయాలని తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



పిరిడిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ తదితరులు

బొబ్బిలి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ.40లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ శంబంగి లక్ష్మీ మంగళవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని పిరిడి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, సర్పంచ్ తుట్ట వరలక్ష్మి, కొల్లి రామినాయుడు, రామకృష్ణ, ఎస్.గౌరీ ప్రసాద్, రాయి రవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల వేగవంతానికి చర్యలు



చీపురుపల్లి రోడ్డులో కొలతలు వేస్తున్న అధికారులు

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని గాయత్రి కాలనీ నుంచి పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ ఐటీ వరకు రోడ్డు విస్తరణ పనుల వేగవంతానికి అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. 80 అడుగుల మేర రోడ్డు విస్తరణ జరగాల్సి ఉండగా, ప్రభుత్వ స్థలాల్లో కాలువల నిర్మాణం పూర్తి చేశారు. ఇంకా మిగిలి ఉన్న ఇళ్లు, కట్టడాల వద్ద పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించి, మండల సర్వేయర్‌తో కొలతలు వేయించారు. రోడ్డు సెంటర్ నుంచి రెండు వైపులా 40 అడుగుల మేర విస్తరణకు సంబంధించి, సొంత స్థలంలో కట్టడాలు ఉన్నవారికి టీడీఆర్ బాండ్లు ఇవ్వనున్నామని కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావు, మేనేజర్ ఎంవీ నాగరాజు, టీపీఓ నాగరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. మంగళవారం సినీ నటుడు, మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు పురస్కరించుకుని, స్థానిక తోటపల్లి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని మొక్కల పెంపకంతోనే అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఖాళీ స్థలాలు, ఇంటి ఆవరణల్లో మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో మెగా అభిమానులు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, జగదీష్, కాంతారావు, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న చిరంజీవి అభిమానులు